క్లుప్తంగా

నేడు గట్టుపల్లిలో శిలువ కొండజాతర



గట్టుపల్లి గుట్టపై ఏర్పాటు చేసిన శిలువ

పూడూరు: మండలంలోని గట్టుపల్లి గ్రామశివారులో ఉన్న శిలువ వద్ద నేడు (ఆదివారం) జాతర ఉత్సవాలు జరుగుతాయని శనివారం నిర్వాహకులు తెలిపారు. ఉ.9 గంటలకు స్తుతి ఆరాధన, 11 గంటలకు బలిపూజ కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు. పరిశుద్ధ శిలువ పండగను ఘనంగా నిర్వహించేలా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఇక్కడ కోరుకున్న కోర్కెలు తీరతాయన్నారు. ప్రతి ఏడాది పెద్ద ఎత్తున ప్రార్థనలు చేయడం జరుగుతుందని తెలిపారు. చుట్టూ పక్కల గ్రామాల నుంచే కాకుండా ఇతర మండలాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమం పాస్టర్ తంగప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని వివరించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో స్వామివారు

కొడంగల్ రూరల్ : పట్టణంలోని పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, మహా మంగళ హారతులు అందించారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు వరాహస్వామి జయంతి

నేడు (ఆదివారం) 7–30గంటలకు వరాహ స్వామివారి జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకొని తరించాలని అన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన అసోసియేషన్ సభ్యులు

అనంతగిరి: వికారాబాద్ ప్లంబర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా షేక్ అమర్ బీన్ అలీ ఎన్నికయ్యారు. శనివారం వికారాబాద్ పట్టణంలో ప్లంబర్స్ ముఖ్యనాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా నరసింహ, జనరల్ కార్యదర్శిగా మహమ్మద్ మాజీద్ అలీ, ఇస్మాయిల్, కోశాధికారిగా వెంకట్‌ను ఎన్నుకున్నారు.

డీఎస్సీపై అవగాహన

తాండూరు టౌన్ : పట్టణంలోని ప్రగతి కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నేడు (ఆదివారం) డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శ్రీశైలం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉ.9 గంటలకు స్థానిక పాత విజ్ఞాన్ కళాశాలలో అధ్యాపకులు లింగంగౌడ్‌వే అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్ నంబర్ 9949272357ను సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు

దౌల్తాబాద్: మండలంలోని కాడీడ్ గ్రామానికి చెందిన మాజీ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మైనోద్దీన్‌తో పాటు 30 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు శనివారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మట్లాడుతూ.. మండలంలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజార్టీ వస్తుందన్నారు. బీఆర్ఎస్ చేస్తున్న మోసాలను ప్రజలు గమనిస్తున్నారని కొడంగల్‌లో కాంగ్రెస్ జెండా ఎగురడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకట్రావు, వీరన్న, సర్పంచ్ శశికళ, రాజేశ్ తదితరులున్నారు.

వంట కార్మికుల వెట్టిచాకిరీ

- ఆరు నెలలుగా వేతనాలు, బిల్లులు రాక అవస్థలు
- అరకొర జీతాలతో బతుకులు భారం
- విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఎలా?



మధ్యాహ్న భోజనం చేస్తున్న వంట కార్మికులు (ఫైల్)

పరిగి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వంటలు చేస్తూ కడుపు నింపుతున్న మధ్యాహ్న భోజన వంట కార్మికుల కడుపు మాత్రం నిండటం లేదు. జీతాలు అందక, గుడ్డు బిల్లులు రాక, ఎండీఎం బిల్లులు రాక నానా అవస్థలు పడుతున్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో విద్యార్థులకు భోజనం సక్రమంగా అందించలేరనే వాదనలు వినిపిస్తున్నాయి. చివరికి అప్పులు చేసి విద్యార్థులకు వండి పెట్టాల్సిన దుస్థితి దాపురించింది. బిల్లులు చెల్లించాలని కొన్నేళ్లుగా ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని వంట ఏజెన్సీల కార్మికులు వాపోతున్నారు.

వంట కార్మికుల అవస్థలు

నియోజకవర్గంలో 269 మంది వంట కార్మికులు పని చేస్తున్నారు. వీరికి గత 15 సంవత్సరాలుగా ప్రతి నెల రూ.1000 చొప్పున గౌరవ వేతనం అందిస్తున్నారు. గతంలో ఆందోళనలు చేపట్టడంతో కార్మికులకు గత మార్చి నెల నుంచి రూ.3వేల గౌరవ వేతనం అమలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ నేటికి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు కాకపోవడంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారు. వంట ఏజెన్సీలకు ఇస్తున్న బిల్లులు సైతం సమయానికి రాక నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం బియ్యం పంపిణీ మాత్రమే చేస్తుండగా నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం అందజేయాల్సిందే.

గుడ్డుకు మార్కెట్ కన్నా తక్కువ చెల్లింపు

వంట ఏజెన్సీల నిర్వాహకులకు అన్ని సరుకుల ఒక ఎత్తయితే గుడ్డుతో తీవ్ర నష్టం జరుగుతుంది. ప్రతి విద్యార్థికి వారానికి మూడు రోజుల పాటు ఉడకబెట్టిన గుడ్డును ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వం గుడ్డుకు రూ.5 చెల్లిస్తుండగా మార్కెట్‌లో రూ. 6.50 అమ్ముతున్నారు. దీంతో ప్రభుత్వం చెల్లించిన దానికంటే ఎక్కువ చెల్లించి గుడ్డును కొనుగోలు చేస్తున్నారు. ఇక 1వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులకు గుడ్డుకు ప్రత్యేక బిల్లులు చెల్లిస్తుండగా 9వ, 10వ తరగతి విద్యార్థులకు మాత్రం రూ.10.67లోనే గుడ్డును కొనుగోలు చేయాల్సి ఉండటంతో వంట ఏజెన్సీలు తీవ్ర నష్టానానికి గురవుతున్నాయని వాపోతున్నారు.

బిల్లులు రాక ఇబ్బందులు



విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నాం. ప్రభుత్వం సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అప్పులు చేసిన విద్యార్థులకు భోజనం అందించాల్సి వస్తుంది. గత ఐదు నెలలుగా బిల్లులు, జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం వెంటనే బిల్లులను చెల్లించాలి.

–లలిత, బసిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల, మధ్యాహ్న భోజన కార్మికురాలు

త్వరలోనే బిల్లులు వస్తాయి..



బిల్లులు మొత్తం చేసి ప్రభుత్వానికి పంపించాం. ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే ఖాతాలో బిల్లులు జమ అవుతాయి. పెండింగ్‌లో ఉన్న ఎండీఎం బిల్లులు త్వరలోనే జమ అవుతాయి.

–హరిశ్చందర్‌నాయక్, మండల విద్యాధికారి పరిగి

ఎమ్మెల్యే ఇంటి ఎదుట అంగన్‌వాడీల ధర్నా



తాండూరు రూరల్: ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

పరిగి: తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని శనివారం ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఇంటి ముందు కూర్చొని నిరసన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా విధులు నిర్వహిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలని కోరారు. మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా గుర్తిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. ఎన్నికల విధులు, ఇతర పనులను ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా చేయించుకున్నప్పుడు ఎందుకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

తాండూరు రూరల్: ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లను ,హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం తాండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆరవ రోజు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. నెలకు అంగన్‌వాడీ టీచర్లకు రూ.26 వేల జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. అంగన్‌వాడీలకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు ,హెల్పర్లు పాల్గొన్నారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు వినతి...

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ శనివారం తాండూరులో పర్యటించారు. విషయం తెలుసుకున్న అంగన్‌వాడీలు ఆర్ఎస్ ప్రవీన్‌కుమార్‌కు తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రం అందజేశారు.

అర్హులందరికీ దళితబంధు ఇవ్వండి

సీపీఐ, డీహెచ్‌పీఎస్ సంఘాల డిమాండ్

పరిగి : గ్రామాల్లో అర్హులైన దళితులందరికీ దళితబంధు ఇవ్వాలని సీపీఐ, డీహెచ్‌పీఎస్ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల దళితులతో కలసి ఎంపీడీఓ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో అర్హులైన దళితులకు ఇవ్వకుండా, కేవలం అధికార పార్టీ నేతలు, కార్యకర్తలకే దళితబంధును ఇవ్వడం సరికాదన్నారు. ప్రతి గ్రామంలో పేద దళితులు ఎంతో మంది ఉన్నారని తెలిపారు. అధికారులు పేద దళితులను గుర్తించి వెంటనే దళితబంధును ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్, సీపీఐ నేతలు యాదయ్య, అనంతయ్య, మాణిక్యం, నాగమణి, ఎల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలి



మట్టి వినాయకులను అందజేస్తున్న మంజుల

వికారాబాద్ అర్బన్: కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులని పూజించాలని మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. వినాయక చవితి సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ చిగులపల్లి మంజుల రమేష్ చేతుల మీదుగా వికారాబాద్ పట్టణ ప్రజలకు మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రసాయనాలతో తయారైన గణపతులను నిమజ్జనం చేస్తే కాలుష్యం పెరుగుతోందన్నారు. పర్యావరణాన్ని కాపాడి భవిష్యత్ తరాలకు మంచిని అందించేందుకు మట్టి విగ్రహాలను పూజించాలన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, ఈఈ వెంకట నర్సింలు, మున్సిపల్ డిఈ సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం

కుల్కచర్ల: పర్యావరణ ప్రేమికులందరూ మట్టిగణపతినే ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించాలని ఘనపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్ అన్నారు. శనివారం పాఠశాల ప్రాంగణంలో చిట్టి మట్టి గణపతిని నెలకొల్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేపటి స్వచ్ఛమైన భవిష్యత్తుకు మట్టి వినాయకులనే ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఆదివారం సెలవు, సోమవారం వినాయక చవితిరోజు సెలవు ఉండటంతో రెండు రోజుల ముందుగానే వినాయకుడిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి శ్రీరామ్




సదస్సులో మాట్లాడుతున్న శ్రీరామ్

కొడంగల్ రూరల్ : విద్యార్థులు చదువుతో పాటు రాజ్యాంగం రూపొందించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి శ్రీరామ్ పేర్కొన్నారు. శనివారం పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన వేదిక సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుకోవాలన్నారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. సమాచార హక్కుచట్టం, విద్యాహక్కు చట్టం, ఆస్తి వివాదాలు తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. అమ్మాయిలను తరలించడం, వేధించడం, ఒకరి స్వేచ్ఛను మరొకరు హరించడం చట్టరీత్యా నేరమ న్నారు. అంతకు ముందు న్యాయవాదులు పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ రాములు మాట్లాడుతూ.. యుక్త వయసులో చెడు వ్యసనాలకు బానిసలయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. మద్యం, డ్రగ్స్ తదితరవాటికి దూరంగా ఉంటూ క్రమశిక్షణతో మెలిగేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు వెంకటయ్య, న్యాయవాదులు కె.రమేష్, బి.కృష్ణయ్య, రవీందర్‌నాయక్, భానుప్రసాద్, కళాశాల వైస్ ప్రిన్స్‌పల్ రఫియాఖాతుమ్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వంతెన లేక తిప్పలు

- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని పాలకులు



వంతెన లేని మల్‌శెట్టిపల్లి తండా వాగు

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని మల్‌శెట్టిపల్లి తండావాసులకు వంతెన లేకపోవడంతో ఏళ్ల తరబడి తిప్పలు తప్పడం లేదు. దీంతో గిరిజనులు తరచుగా ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షాకాలం వాగు దాటడం చాలా కష్టం. కానీ, వేరే మార్గం లేక ప్రాణాలకు తెగించి వెళ్తున్నారు. ప్రస్తుతం వాగు పారడంతో సీసీ బెడ్‌పైన నీచు పట్టి జర్రున జారిపడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు కాలినడకన వెళ్లే వారు తరచుగా కిందపడి గాయపడుతున్నారు. సీసీబెడ్‌పై నుంచి నీరు పారడం తగ్గే వరకు నీచు అలాగే ఉంటుంది. ప్రస్తుతం వానాకాలం కావడంతో ఇప్పట్లో సీసీ బెడ్‌పై నీరు తగ్గవు. తండాకు వెళ్లే వాహనదారులు పొరపాటున ఎడమ వైపున కింద పడితే ఇక అంతే సంగతులు. ఎందుకంటే తండాకు వెళ్తుంటే ఎడమ వైపులో నీరు చాలా లోతుగా ఉంటుంది. ఈత రాని వారు ప్రాణాలు కోల్పోవాల్సిందే. వంతెన నిర్మాణానికి చాలా కాలంగా పాలకులకు విన్నవిస్తున్నా ఎవ్వరు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత పీఆర్ డీఈ జితేందర్‌రెడ్డిని సంప్రదించగా బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.

వాగు దాటడం చాలా కష్టం



వానాకాలం వాగు దాటడం చాలా కష్టం. నిరంతరం వాగు పారుతూనే ఉంటుంది. వాగువస్తే వరద ఉధృతి తగ్గే వరకు ఎక్కడి వారు అక్కడే ఉండాల్సిన పరిస్థితి. వాగులో నుంచి తాత్కాలికంగా వేసిన సీసీ బెడ్ పైన ప్రస్తుతం నీచు పట్టి ప్రమాదకరంగా తయారైంది. వాగు దాటే క్రమంలో వాహనదారులు, పాదచారులు జారి కింద పడుతున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలి. వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

– నాన్యనాయక్ , మలౌట్టిపల్లి తండా

రైతు సంక్షేమమే సీఎం ధ్యేయం



తరలుతున్న కార్యకర్తలతో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



పరిగి: బయలుదేరిన నాయకులు



దోమ: ప్రాజెక్టు ప్రారంభానికి వెళ్తున్న నేతలు

కొడంగల్ రూరల్ : పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి శనివారం భారీగా నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో తరలివెళ్లారు. నియోజకవర్గం నుంచి దాదాపు వంద ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలలో రైతులు, ప్రజలు వెళ్లారు. పట్టణంలోని సంతబజార్ సమీపంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సభకు వెళ్తున్న ప్రజల వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చారిత్రక ఘట్టం ఆవిష్కరణకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివెళ్తున్నారని అన్నారు. ఎన్నో ఏళ్ల కల సాకారం అవుతుందని తెలిపారు. మండలంలోని అన్నారం, పోశమ్మ తండా, ప్యాలమద్ది, అయినన్‌పల్లి, పర్సాపూర్, ఆలేడ్, ఉడిమేశ్వరం, అంగడిరాయిచూర్, రుద్రారం తదితర గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి తరలివెళ్లారు.

ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి తరలిన నాయకులు

పరిగి: సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి అని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు అన్నారు. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును సీఎం కేసీఆర్ ప్రారంభిస్తుండడంతో శనివారం పట్టణ కేంద్రం నుంచి నాయకులు, అధికారులు బయలుదేరారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రారంభంతో మన జిల్లాలకు కూడా త్వరలోనే నీరు అందుతుందన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంతో ప్రతి ఎకరానికి నీరందుతుందని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి

దోమ : రైతులకు సాగు, తాగు నీరు అందించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టును నిర్మించారని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల బీఆర్ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి బస్సులో బయల్దేరారు. ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమ ధ్యేయంగా కేసీఆర్ ముందుకు సాగుతున్నారని,ఎన్ని ఆటంకాలు ఎదురైనా పాలమూరు ప్రాజెక్టును నిర్మించి రైతులకు సాగునీరు, తాగు అందించేందుకు చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. పాలమూరు ప్రాజెక్టుతో దోమ మండలానికి కూడా త్వరలో సాగునీరు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఉచిత వైద్య శిబిరం

అనంతగిరి: విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి అవధుల్లేని లక్ష్యాలను సాధించాలని సబిత ఆనంద్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ మెతుకు సబిత అన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని కేజీబీవీ విద్యాలయంలో ఎంపీ రంజిత్ రెడ్డి పుట్టినరోజు పురస్కరించుకొని ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మేక పావని, బొండాల సువర్ణ, రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

అనంతగిరి: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా వికారాబాద్‌లోని ఆడియో కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్ మాట్లాడుతూ.. రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించడంలో బీజేపీదే నైతిక బాధ్యత అన్నారు. 18 నుంచి జరిగే ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లుపెట్టి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు.

వెంకటలక్ష్మికి సన్మానం



సన్మానిస్తున్న సహ ఉపాధ్యాయులు

పెద్దేముల్: మండల ప్రాథమిక పాఠశాల నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన జి. వెంకటలక్ష్మిని శనివారం సహ ఉపాధ్యాయులు సన్మానం చేశారు. జిల్లా ఉత్తమ అవార్డు విద్యబోధన పట్ల బాధ్యత పెంచుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరసింహ్మయ్య , ఉపాధ్యాయులు శ్రీనివాస్‌లు సి. రవీందర్ రెడ్డి, నర్సిరెడ్డి, సంగీత, నషీజ్ సుల్తానా,కె. రాధతో పాటు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడు జిల్లాతో పాటు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందాలన్నారు.

విద్యారంగంపై నిర్లక్ష్యం



ఉద్యోగులకు మద్దతు తెలుపుతున్న ఆర్ఎస్‌ప్రవీణ్



తాండూరు: బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్

వికారాబాద్ అర్బన్: సీఎం కేసీఆర్ 70వేల పుస్తకాలు చదివానని చెప్పుకోవడం పూర్తి అబద్ధమని, ఆయన అసలు మేధావి కాదని బీఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం తాండూరుకు వెళ్తుండగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో గత 17 రోజులుగా సమ్మె చేస్తున్న సర్వశిక్ష ఉద్యోగుల దీక్ష శిబిరం వద్ద ఆగి వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ మేధావి అయితే సర్వశిక్షలో పనిచేస్తున్న ఇంత మంది మేధావులను రోడ్డుపై కూర్చోబెట్టడని ఆరోపించారు. ఆయనకు విద్యారంగంపై ఏమాత్రం అవగాహన లేదని విమర్శించారు. కేసీఆర్ ఏనాడు విద్యారంగానికి అధిక నిధులు ఇవ్వకపోగా, ప్రభుత్వ ఉపాధ్యాయులను, విద్యాశాఖలో పనిచేసే ఇతర ఉద్యోగులను ఆయన ఎప్పుడు వేధిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి కేసీఆర్‌ను మేధావి అని ఎలా అంటారని ప్రశ్నించారు. కేసీఆర్ రాష్ట్రంలోని 70లక్షల మంది విద్యార్థుల వైపా లేక 70మంది కాంట్రాక్టుల వైపా స్పష్టం చేయాలన్నారు. తెలంగాణలో పాలన మొత్తం ఆ 70మంది జేబులు నింపేందుకే పనిచేస్తున్నట్లు ఆరోపించారు. బీఎస్పీ పార్టీ విద్యార్థుల కోసం, ఉద్యోగుల కోసం, పేదల కోసం పుట్టిన పార్టీ అని చెప్పుకొచ్చారు. సర్వశిక్ష ఉద్యోగులకు బీఎస్పీ మద్దతుగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా బీఎస్పీ వికారాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి క్రాంతికుమార్, పెద్ది అంజయ్య తదితరులు ఉన్నారు.

బహుజనులకే రాజ్యాధికారం

తాండూరు: రానున్న రోజుల్లో తెలంగాణలో బహుజనులకే రాజ్యాధికారం వస్తుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలో బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలియంమూన్ చౌక్ నుంచి ఎస్‌వీఆర్ గార్డెన్ వరకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు. అనంతరం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలతో పాటు అగ్రవర్ణాల్లో ఉన్న పేదల పక్షాన పార్టీ నిలబడుతోందన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు తదితరులున్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని మండల పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి బస్వరాజు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో కొనసాగిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల రిలే దీక్షకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యావ్యవస్థలో కీలకమైన అన్ని రంగాల్లో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ కుల్కచర్ల మండల గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, సంఘ నాయకులు శ్రీనివాస్, శేఖర్, గాంగ్యనాయక్, కృష్ణ, రమేష్, విజయ్, రాజు, ప్రవీణ్, రఘు పాల్గొన్నారు.

పీఆర్టీయూ సంఘం నేతల సంఘీభావం

బొంరాస్‌పేట: ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెకు శనివారం బొంరాస్‌పేట, దుద్యాల మండల పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట జరుగుతున్న సమ్మెకు మద్దతు తెలిపిన పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన దీక్షకు మద్దతు ప్రకటించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులకు ఎస్ఎస్ఏ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అనిల్‌కుమార్, జలందర్‌రెడ్డి, శశిధర్, శ్రీహరి, భూదేవి, అంజురాథోడ్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు, ఇరు మండలాల ఎస్ఎస్ఏ ఉద్యోగులు గౌస్, సీఆర్‌పీలు నర్సింలు పాల్గొన్నారు.